నేను పక్కా లోకల్..


ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్: ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు పరిచయం అక్కర్లేని పేరు. మూడు దశాబ్దాల పాటు టీడీపీలో అనేక హోదాల్లో పని చేసి 2014లో బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో విజయం సాధించి ఎమ్మెల్యే కావాలనే తన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. మూడో సారి పోటీ చేస్తున్న ఆయన ఈసారి గెలిచి మంత్రి పదవి దక్కించుకోవాలని సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. ఈ సందర్భంగా ప్రచార శైలి, విజయావకాశాలు ముషీరాబాద్‌లో చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తాయన్నారు.

సాక్షి: విజయ అవకాశాలు ఎలా ఉన్నాయి?

ముఠా: నాకు విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో 38 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించాను. ఇప్పుడు అంతకంటే ఎక్కువ మెజార్టీ సాధిస్తాననే నమ్మకం ఉంది. నాకు పోటీ ఎవరూ లేరు. రెండో స్థానం కోసమే కాంగ్రెస్, బీజేపీ పోటీపడుతున్నాయి. గతంలో నాపై పోటీ చేసిన వారు ఈసారి మొకం చాటేశారు. ఇప్పుడు పోటీ చేస్తున్న వారు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారో లేదో చూడాలి.

సాక్షి: మళ్లీ గెలిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

ముఠా: సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ముషీరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రూపురేఖలను మారుస్తా. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతాం. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. కొత్త రేషన్ కార్డులను, కొత్త పింఛన్లు అందిస్తా.

సాక్షి: ప్రజలకు మీరు చేసే విన్నపం ఏమిటి?

ముఠా: నేను పక్కా లోకల్ ముషీరాబాద్ నడిబొడ్డున మీకు కూత వేటు దూరంలో ఉంటా. పిలిస్తే ఐదు నిమిషాల్లో మీ దగ్గర ఉంటా. మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా మీ కుటుంబ సభ్యుల్లో ఒకడిగా ఉంటా. కానీ ఇప్పుడు ఓటు వేయమని వచ్చే నాయకులు ఎక్కడ ఉంటారో ఒకసారి ఆలోచించండి వారు నాన్ లోకల్ అని గుర్తించండి. నాతో స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం ప్రతి ఒక్కరికి ఉంది. ఇతర పార్టీ అభ్యర్థులతో ఆ అవకాశం ఉందో లేదో ప్రజలు ఆలోచించుకోవాలి. ఈ ఐదేళ్లలో ఎవరి వ్యాపారాలు, నిర్మాణాల్లో నేను గానీ, మా పార్టీ నాయకులు గానీ జోక్యం చేసుకోలేదు. కానీ వేరే పార్టీ గెలిస్తే ఏం జరుగుతుందో ఆయా వర్గాలు అర్థం చేసుకోవాలి. ఓటు వేసే ముందు విజ్ఞతతో, వివేకంతో ఆలోచించి ఓటు వేయాలని కోరుతున్నా.

ఆరు గ్యారంటీలకు నేనే గ్యారంటీ...



ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్‌లతో పాటు వివిధ జాతీయ నాయకులు బహిరంగ సభలను నిర్వహిస్తు నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే...

- ''నన్ను గెలిపిస్తే ముషీరాబాద్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా. అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా. సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా రెండుసార్లు పని చేసిన అనుభవంతో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తా. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల పట్ల ప్రజలు విశేషంగా ఆకర్షితులవుతున్నారు. మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుంది. నియోజకవర్గంలో ముఖ్యంగా రెగ్యులైజేషన్ కోసం 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెగ్యులరైజేషన్ అయ్యేలా చూస్తాను. అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు, ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కొత్త రేషన్ కార్డు, కొత్త పెన్షన్‌లు ఇస్తాము. తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. ఆశోక్‌నగర్ నుంచి దోమలగూడ నుంచి హుస్సేన్‌సాగర్ నాలాపై లింక్ బ్రిడ్జీ నిర్మాణం చేపడతా. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి నాణ్యమైన విద్యను అందిస్తా. క్రీడా మైదానాలు, రైతు బజార్, జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, ఇందిరాపార్కులో అంతర్జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి కృషి చేస్తా. నేను నికార్సైన కాంగ్రెస్ నేతను. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా పార్టీని విడిచి వెళ్లలేదు. తెలంగాణ రెండో దశ ఉద్యమంలో పార్లమెంటులో అసలైన ఉద్యమం చేసి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సోనియాను ఒప్పించిన వాడిలో నేనే ప్రథమంగా ఉన్నాను. అందుకే ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు నన్ను గెలిపిస్తారనే నమ్మకం ఉంది.

బీజేపీతోనే అభివృద్ధి

- జీసీ ముఖ్యమంత్రి ప్రకటనతో సానుకూల స్పందన.
- ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు


ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు ఆ పార్టీ సీనియర్లను కాదని టికెట్ దక్కించుకుని బరిలో నిలిచారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబానికి చెందిన పూస రాజు డాక్టర్ కె.లక్ష్మణ్ అండదండలతో ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. కేడర్ బేస్డ్ పార్టీ అయిన బీజేపీలో చాపకింద నీరులా ప్రచారం సాగిస్తున్న పూస రాజుతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే...

- ''ముషీరాబాద్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమం. గతంలో బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ చేసిన అభివృద్ధి జాడలే ఇంకా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభివృద్ధిని గాలికి వదిలేశారు. నా విజయానికి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా బీసీ ముఖ్యమంత్రి ప్రకటనతో బీసీల్లో సానుకూల స్పందన కనిపిస్తుంది. దీనికి తోడు ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇవ్వడం, మందకృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇవ్వడంతో నియోజకవర్గంలోని ఎస్సీలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కూడా బహిరంగంగా ప్రచారం నిర్వహిస్తూ నాకు ఓటు వేయమని కోరుతున్నారు. 2018 ఎన్నికల్లో గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన ముఠా గోపాల్‌కు గంగపుత్రులు మద్దతు ప్రకటించారు. అయితే ఈ దఫా ఇదే సామాజిక వర్గానికి చెందిన నేను పోటీ చేస్తుండడంతో గంగపుత్రుల సంఘాలు నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయి. ఇక సంప్రదాయ బీజేపీ ఓటు బ్యాంకు ఉండనే ఉంది. డాక్టర్ కె.లక్ష్మణ్ నా వెన్నంటే ఉంటూ ఎప్పటికప్పుడు ఇచ్చే సలహాలు, సూచనలు నా విజయానికి దోహదం చేస్తాయి. ప్రస్తుతం పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు స్థానికేతరులే. నేను మాత్రమే ముషీరాబాద్‌లో పుట్టి పెరిగాను. బీజేపీ ప్రకటించిన సకల జనుల సౌభాగ్య తెలంగాణ పథకాలను చూసి కూడా ప్రజలు బీజేపీకి ఆకర్షితులవుతున్నారు. ముస్లీం, క్రిస్టియన్ ఓట్లను రెండు పార్టీలు చీల్చుకోవడంతో నేను సులభంగా సులభంగా విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్


యాదవ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను కర్ణాటక రాష్ట్రంలో విజయంతంగా అమలు చేస్తుందని, రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ అమలు చేసి తీరుతుందని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కవాడిగూడ డివిజన్‌లోని కవాడిగూడ కమ్యూనిటి హాల్, చిత్రాల నగర్, కోదండరెడ్డినగర్, కుమ్మరిబస్తీ, కాముని కుంట తదితర ప్రాంతాల్లో ఆరు గ్యారంటీలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..పదేళ్ల బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారని, ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి చూడాలని ఓటర్లను అభ్యర్థించారు. కేంద్రం, రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు అవినీతి, నియంత పాలన సాగిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు.కార్యక్రమంలో ఆకుల ప్రవీణ్, వి.డి. కృష్ణ, భాస్కర్, లక్ష్మణ్, సూర్యచంద్రశేఖర్, ప్రభాకర్, రమేష్‌యాదవ్, కిట్టు, హరికృష్ణ, రాము, సాయిబాబా, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే బీసీల మద్దతు


హాజరైన యాదవులు

ముషీరాబాద్: బీసీ కులస్తులందరూ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని వారి ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని కాంగ్రెస్ ముషీరాబాద్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని మహ్మదీయ హాల్‌లో గ్రేటర్ హైదరాబాద్ యాదవ సేన ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి పెండం శ్రీనివాస్‌యాదవ్, ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంజన్‌కుమార్‌యాదవ్‌ను యాదవ సంఘాల నాయకులు భారీ గజమాలతో సన్మానించారు. ఆర్.కల్పనా యాదవ్, యాదవ సేన నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, విజయ్‌కుమార్‌యాదవ్, మెరుగు శ్రీనివాస్‌యాదవ్, నీలం శ్రీనివాస్, శంకర్‌యాదవ్ తదితరులున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగ ఉపాధ్యాయుడికి పోస్టల్ బ్యాలెట్ అందించాలని కోరుతూ ఆదివారం జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వికాస్ రాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 28లోగా ప్రతి ఒక్కరు తమ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, పాలిటెక్నిక్ విభాగం అధ్యక్షులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన 26 బీసీ కులాలను బీసీ జాబితాలో చేర్చాలి



కాచిగూడ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రంలో తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, గౌడ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆదివారం నగరానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం మేరకు బంజారాహిల్స్ హోటల్ తాజ్‌కృష్ణలో రాహుల్ గాంధీని కలిసి బీసీల సమస్యలను వివరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో జనగణనలో కుల గణన అంశాన్ని చేర్చినందుకు రాహుల్ గాంధీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

కమనీయం.. శ్రీశైల మల్లికార్జునస్వామి కల్యాణం



కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రచన టెలివిజన్, భక్తి టీవీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటిదీపోత్సవం ఆదివారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అత్యంత వైభవంగా శ్రీశైలం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నండూరి శ్రీనివాస్ ప్రవచనామృతం వినిపించగా, ప్రధాన వేదికపై ఉజ్జయిని శివలింగానికి కోటి బిల్వార్చన చేశారు. భక్తులచే శివనామస్మరణతో కోటి దీపోత్సవ ప్రాంగణం మారు మ్రోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉజ్జయిని భస్మహారతి, జ్వాలాతోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం స్వామివారిని నంది వాహనంపై కోటి దీపోత్సవ ప్రాంగణంలో ఊరేగించారు.



దొరల తెలంగాణ మనకొద్దు

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్ రెడ్డి


నల్లకుంటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిన్ రెడ్డి

నల్లకుంట: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ పార్టీ ఎత్తులు వేస్తోందని అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి. రోహిన్ రెడ్డి అన్నారు. ఈ సారి దొరల తెలంగాణను పారదోలి ప్రజా తెలంగాణను సాధించుకుందామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నల్లకుంట డివిజన్‌లో రోహిన్ రెడ్డి తన తండ్రి డాక్టర్ ముత్యం రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందనే అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్‌పై అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో మహిళలు, రైతులకు, యువత, వృద్ధులతో పాటు వివిధ రంగాల వారికి ప్రయోజనాలు చేకూరతాయన్నారు. గృహ జ్యోతి, మహాలక్ష్మి, యువవికాసం, తదితర పథకాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్, నాయకులు రమేష్, మోత రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కు మద్దతుగా సిద్ధరామయ్య ప్రచారం



ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు మద్దతుగా ఆదివారం నియోజకవర్గంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరతామని హామీ ఇచ్చారు. – ముషీరాబాద్

ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం

ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు


అభివాదం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణపై ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పూస రాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. మాదిగల న్యాయమైన డిమాండ్ల సాధనకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ జరిగేలా ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గంలోని మాదిగ కులస్తులంతా కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ఎం.నాగరాజు, నాయకులు గండి కృష్ణమాదిగ, గజ్జల రాజశేఖర్, నందగిరి నర్సింహ్మ, దశరథ్, అశోక్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అద్భుతం

కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్


మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

అంబర్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని కర్ణాటక రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కాంగ్రెస్ అంబర్‌పేట నియోజవర్గ అభ్యర్థి రోహిన్ రెడ్డికి మద్దతుగా శనివారం రాత్రి అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన పాల్గొన్నారు. కర్ణాటకలో తాము అమలు చేస్తున్న ఐదు గ్యారంటీలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్ తోనే రాష్ట్రాభివృద్ధి

కాచిగూడ: తెలంగాణ ప్రజల ఇబ్బందులను గుర్తించే సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని, రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నాయకుడు, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన కాచిగూడ, బర్కత్‌పుర ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రజాపతి విస్తృత ప్రచారం


టూత్ బ్రష్ గుర్తుతో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రవికుమార్ ప్రజాపతి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి రవికుమార్ ప్రజాపతి ఆదివారం తన ఎన్నికల గుర్తు అయిన టూత్ బ్రష్ గుర్తుతో నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నాలుగు సార్లు సివిల్స్‌లో ఉత్తీర్ణుడై ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ఆయన వందలాది మందిని ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దారు. హెల్తీ పాలిటిక్స్ భావనతో ఎందుకు రాజకీయ రంగ ప్రవేశం చేయాల్సి వచ్చిందో వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. తాను గెలిస్తే రాంనగర్ చేపల మార్కెట్‌కు నూతన భవనాన్ని నిర్మిస్తానని, ఉచిత మినరల్ వాటర్ ప్రతి ఇంటికి అందిస్తానని, వీధి వ్యాపారులకు సామాజిక భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో వంద మందికి పైగా విద్యావంతులు పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ రోడ్ షో

ముషీరాబాద్: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించనున్నారు. సాయంత్రం రాంనగర్ చౌరస్తాలో జరిగే రోడ్‌షో పాల్గొంటారు. అనంతరం భోలక్‌పూర్‌లోని సుప్రీం హోటల్ వద్ద 7 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో..

అంబర్‌పేటలో..

అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామరావు ప్రచారం చేయనున్నారు. సాయంత్రంఅలీ కేఫ్ నుంచి రోడ్ షో ప్రారంభం అవుతుందని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అలీకేఫ్ నుంచి ఫివర్ ఆస్పత్రి చౌరస్తా వరకు రోడ్ షో కొనసాగనుంది.

సీపీఎం అభ్యర్థి దశరథ్ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ మధు

ముషీరాబాద్: ముషీరాబాద్ సీపీఎం అభ్యర్థి ఎం.దశరథ్‌కు మద్దతుగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద బైక్ ర్యాలీని మాజీ ఎంపీ పి.మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, దేశంలో బీజేపీ మతోన్మాదం పెరిగిపోతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు దేశాన్ని తాకట్టు పెడుతుందని ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ సర్కార్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీపీఎం పోరాడుతుందన్నారు. సీపీఎం అభ్యర్థి దశరథ్‌ను గెలిపించాలని కోరారు. సిపిఎం అభ్యర్థి ఎం.దశరథ్, ఎం.శ్రీనివాస్, శ్రీనివాస రావు, వెంకటేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అంబర్‌పేట అభ్యర్థి సి.కృష్ణయాదవ్‌తో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. బర్కత్‌పుర, కాచిగూడ, నల్లకుంట, బాగ్అంబర్‌పేట, అంబర్‌పేట, గోల్నాక డివిజన్‌లలో పర్యటించిన ఆయన బీజేపీకి ఓటు వేయాలని కోరారు. బాగ్అంబర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు దివిటి రజిని కాంత్ ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. నియోజకవర్గంలో బీజేపీకి మద్దతుగా గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ముషీరాబాద్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్ తదితరులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆజాదీ పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత కరిపే రాజ్‌కుమార్ కవిత సంపుటి ఆజాదీ పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సాహితీవేత్త కె.ఆనందచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని కదిలించగలిగే ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు, కొమ్మవరపు విల్సన్‌రావు, ఎం.నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, గుడిపాటి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటాం

ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్


హాజరైన 29 సంఘాల ఐక్యవేదిక నాయకులు

ముషీరాబాద్: పద్మశాలీలకు అన్ని విధాల అండగా ఉంటామని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ముఠా గోపాల్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో పద్మశాలీలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చారని, ఈ ఎన్నికల్లోనూ అన్ని సంఘాలు మద్దతు అందించి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. భవిష్యత్తులో పద్మశాలీలకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా చేనేత వృత్తిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బింగి నవీన్, ప్రశాంత్, నంజీవరావు, వున్న సత్యనారాయణ, ఆర్.ఎల్.రమేష్, నేత శ్రీనివాస్, జెల్ల భిక్షపతి, రాజ్‌కుమార్, రూప, పద్మ, బోనం ఊర్మిల పాల్గొన్నారు.

29 గంగపుత్ర సంఘాల మద్దతు..

భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం భవనంలో 29 స్థానిక గంగపుత్ర సంఘాలు, రాష్ట్ర, నగర గంగపుత్ర సంఘాలు బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చాయి. ఆదివారం నిర్వహించిన సభలో సంఘాల ఐక్యవేదిక నాయకులు కె.ఎం.శంకర్ మాట్లాడుతూ గంగపుత్రల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఆనంద్‌రావు, సాయి, వినోద్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్ విజయం సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమని పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఎస్‌బీఐ కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఠా గోపాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, పరశురాం, రహీం, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయండి

అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్


రైల్వే ట్రాక్ లేన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన నల్లకుంట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ నల్లకుంటలోని బ్రాహ్మణ హాస్టల్ లేన్, తిలక్‌నగర్, తిలక్‌నగర్ రైల్వే ట్రాక్ లేన్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను ఓటర్లకు వివరించారు. ఆసరా పింఛన్ల దశల వారీగా రూ. 5016కు పెంచుతామని, అర్హులైన పేద కుటుంబాల మహిళలకు సౌభాగ్యలక్ష్మి ద్వారా ప్రతి నెలా రూ. 3వేలు, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి రూ. 15 లక్షల ఆరోగ్య రక్ష, రూ. 400లకే గ్యాస్ సిలిండర్, మహిళా సమాఖ్యలకు సొంత భవనాలతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. భవిష్యత్‌లో అంబర్‌పేట నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందేందుకు బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు గోనే ప్రదీప్ రావు, ఎం.భూపతినాథ్, భాస్కర్ గౌడ్, సీహెచ్. సాయి మోహన్, నవీన్, క్రిసోలైట్, ప్రదీప్, బస్తీ పెద్దలు శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.


కాలేరుకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు